సాక్షి
చిత్తూరు

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



చరిత్ర సంతకం..సజీవ సాక్ష్యం

పలమనేరులో బ్రిటిష్‌కాలంలో నిర్మించిన భవనాలు నేటికీ చరిత్రకు సాక్షంగా నిలిచి ఉన్నాయి. - 8లో



రెండోరోజు గాలింపు చర్యలు

గౌనివాని చెరువులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం రెండో రోజైన శనివారం కూడా గాలింపు చర్యలు కొనసాగాయి. - 8లో



ఆటోను ఢీకొన్న లారీ

ఆటోను లారీ ఢీకొన్న సంఘటనలో 13 మంది గాయపడ్డారు. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. - 8లో

న్యూస్‌రీల్

వందశాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని మోడల్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణతకు ప్రత్యేక ప్రణాళిక అమలు చేయాలని రాష్ట్ర విద్యాశాఖాధికారులు ఆదేశించారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులు జారీ చేసిన ఉత్తర్వులు శనివారం డీఈఓ కార్యాలయానికి అందాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న మోడల్ స్కూళ్లలో పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు, అభ్యసనం, వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులకు నిర్దేశించిన ప్రత్యేక ప్రణాళికను తప్పనిసరిగా అమలు చేయాలని పేర్కొన్నారు.

పకడ్బందీగా వృత్తివిద్య కోర్సు పరీక్షలు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఒకేషనల్ కోర్సు అమలవుతున్న పాఠశాలల్లో పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారులు శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకేషనల్ విద్య ప్రాక్టికల్ అసెస్‌మెంట్ పరీక్షలు పక్కాగా నిర్వహించాలన్నారు. సెక్టార్ స్కిల్ కౌన్సిల్ పరీక్ష 50 మార్కులకు నిర్వహించాలని, అందులో 20 మార్కులకు పాఠశాల స్థాయిలో ఇంటర్నల్ పరీక్ష నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లాలోని 46 పాఠశాలల్లో పరీక్షలను పకడ్బందీగా నిర్వహించి, ఈ నెల 28వ తేదీ వరకు మూల్యాంకనం చేయాలని ఆ ఉత్తర్వుల్లో సూచించారు.

విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలి



మాట్లాడుతున్న ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు

చిత్తూరు కలెక్టరేట్ : వసతి గృహాల్లోని పదో తరగతి విద్యార్థులు ప్రణాళిక ప్రకారం చదవాలని ఏఎస్‌డబ్ల్యూఓ నాగేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో చిత్తూరు, జీడీ నెల్లూరు పరిధిలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పదో తరగతి పాఠ్యాంశ నిపుణులు పాల్గొని, విద్యార్థులకు మెలుకువలు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడికి లోనుకాకూడదన్నారు. పబ్లిక్ పరీక్షలపై ఉన్న భయాన్ని విడనాడాలని తెలిపారు. విద్యార్థులకు అందజేసిన స్టడీ మెటీరియల్‌లోని అంశాలను నేర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌డబ్ల్యూఓ షకీలా, వార్డెన్లు నవీన్, సురేష్, రమేష్, ఏకాంబరం, సబ్జెక్ట్ నిష్ణాతులు మురళి, షంషీర్‌ఖాన్, అరుణ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కీచక మాస్టార్లు



చిత్తూరు జిల్లా కేంద్రంలోని కట్టమంచి మున్సిపల్ పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు ధనశేఖర్(సోషల్)పై కేసు నమోదు చేశారు. ఆ పాఠశాల విద్యార్థినుల ఫిర్యాదు మేరకు విద్యాశాఖాధికారులు విచారణ నిర్వహించారు. సంబంధిత టీచర్‌ను సస్పెండ్ చేస్తూ డీఈఓ వరలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుపతి జిల్లా నారాయణవనం మండలం ఎరికంబట్టు ఎస్సీ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో ఈ నెల 6 వ తేదీన కీచక టీచర్ బాగోతం బయటపడింది. ఆ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న వెంకటరమణ మధ్యాహ్నభోజన సమయంలో నలుగురు బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తించాడు. సాయంత్రం ఇంటికి వెళ్లిన చిన్నారులు తల్లిదండ్రులకు చెప్పడంతో విషయం బయటపడింది. దీంతో ఆ ఉపాధ్యాయునిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అమ్మ జన్మనిస్తుంది..నాన్న జీవితాన్నిస్తారు.. ఆ ఇద్దరి ప్రేరణతో జీవితం ప్రారంభించిన చిన్నారిని అత్యున్నత శిఖరాలకు చేర్చేందుకు అంతులేని ప్రోత్సాహమిచ్చి, ఉన్నతంగా రాణించేందుకు ఊపిరిలూదే అద్భుత శిక్షకుడే గురువు. అందుకే గురువుకు తల్లి, తండ్రి తరువాతి స్థానం ఇచ్చారు. అంతటి ప్రాధాన్యం ఉన్న ఉపాధ్యాయుడే కీచకుడిగా మారితే.. మరి చిన్నారుల పరిస్థితి ఏమిటి? వారు తమకు జరిగిన అన్యాయం గురించి ఎవరికి చెప్పుకోవాలో? ఎలా చెప్పుకోవాలో తెలియక కుమిలిపోతున్నారు. పూజ్యనీయులైన కొందరు గురువులే ఇటీవల గాడి తప్పుతున్న సంఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. విద్యార్థులతో అసభ్యంగా ప్రవర్తిస్తూ కీచకులుగా మారుతున్న ఘటనలతో సమాజమే తలదించుకోవాల్సి వస్తోంది.

- మంచి మార్గంలో నడిపించాల్సిన టీచర్లే వక్రమార్గంలో
- బాలికలతో అసభ్య ప్రవర్తన, వెకిలి చేష్టలు
- విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ లేమితో దారుణాలు
- విద్యాశాఖ కీర్తి ప్రతిష్టలు దెబ్బతీసేలా ఘటనలు
- చిత్తూరు, తిరుపతి జిల్లాలో వరుసగా పలు ఘటనలు



చిత్తూరు కలెక్టరేట్ : ఒక విద్యార్థి తన జీవితంలో ఇంట్లో కన్నా ఎక్కువ సమయం ఉపాధ్యాయుల వద్దే ఉంటారు. తల్లిదండ్రులు చెప్పిన దానికన్నా టీచర్లు చెప్పిన విషయాన్నే ఎక్కువ నమ్ముతారు. అలాంటి సముచిత స్థానం గురువులకు ఉంది. అయితే విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పాల్సిన కొంత మంది ఉపాధ్యాయులు సభ్యత మరిచిపోతున్నారు. అక్షరాలు నేర్పాల్సిన చేతితో బ్యాడ్ టచ్ చేస్తూ వికృతానందం పొందుతున్నారు. గురువుల ప్రవర్తనతో బాలికలు విసుగు చెందుతూ ఇబ్బందులకు లోనవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని కొందరు టీచర్లు కీచకులుగా మారుతున్నారు. చట్టాలు ఎంత పదునుగా తయారవుతున్నా వేధింపులు మాత్రం ఆగడం లేదు. అయితే వారి దుశ్చర్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలో తెలియక చాలామంది బాధితులు లోలోపలే కుమిలి పోతున్నారు.

వెలుగులోకి రాని సంఘటనలెన్నో..

బ్యాడ్ టచ్ బారిన పడుతున్న పిల్లలు తమ బాధను ఎవరికీ చెప్పుకోలేకపోతున్నారు. తల్లిదండ్రులకు సైతం చెప్పే స్వేచ్ఛ కొన్ని కుటుంబాల్లో లేకపోవడంతో మానసికంగా కుంగిపోతున్నారు. చిత్తూరు జిల్లాలో 2,436, తిరుపతి జిల్లాలో 2,444 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. చిత్తూరు జిల్లాలో 1,41,217, తిరుపతి జిల్లాలో 1,87,444 మంది విద్యార్థులు ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు విద్యనభ్యసిస్తున్నారు.

చూసీచూడనట్టుగా అధికారులు

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులపై పలు లైంగిక వేధింపుల ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న టీచర్లపై విద్యాశాఖాధికారుల పర్యవేక్షణ కొరవడిందనే ఆరోపణలున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇలాంటి ఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయి. రెండు జిల్లాల్లో ప్రతి మండలానికి ఎంఈఓలు, డీవైఈఓలు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులపై లైంగిక వేధింపులు, అసభ్య ప్రవర్తనలు పెరిగిపోతున్నా స్థానిక విద్యాశాఖాధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారు. తరగతి గదుల్లో విద్యార్థులకు నాణ్యమైన పాఠాలు బోధించి వారిని సుశిక్షితులుగా తీర్చిదిద్దాల్సిన ఉపాధ్యాయుల్లో కొందరు వికృత చేష్టలకు పాల్పడుతున్నప్పటికీ విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థి సంఘాలు ఆరోపిస్తున్నాయి. సంఘటనలు జరిగిన సమయంలో డిప్యూటేషన్‌ల పేరుతో సదరు టీచర్లను పాఠశాలలను మార్చుతున్నారే తప్ప... అలాంటివి పునరావృత్తం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవడంలో చిత్తూరు, తిరుపతి జిల్లా విద్యాశాఖాధికారులు విఫలమవుతున్నారు.

చిత్తూరు జిల్లా సమాచారం

బాలురు	80,478
బాలికలు	60,739
మహిళా టీచర్లు	4,441
పురుష టీచర్లు	7,489
మొత్తం టీచర్లు	11,939

తిరుపతి జిల్లా సమాచారం

బాలురు	95,755
బాలికలు	91,689
మహిళా టీచర్లు	5,910
పురుష టీచర్లు	6,987
మొత్తం టీచర్లు	12,897



పోక్సో చట్టం ఏం చెబుతోంది..

ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్ ఫ్రమ్ సెక్సువల్ అఫెన్సెస్ (పోక్సో). ఇది లైంగిక వేధింపుల నుంచి పిల్లలకు రక్షణ కల్పించే చట్టం. లైంగికదాడులు, నేరాలకు పాల్పడిన నిందితులకు ఈ చట్టంతో జీవితఖైదు, లేదా 7 నుంచి 10 ఏళ్ల వరకు జైలుశిక్ష విధిస్తారు. 16 ఏళ్ల లోపు బాలికలపై అత్యాచారం జరిగితే కనీసం 10 నుంచి 20 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది.

చిత్తూరు జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1902	64,519
ప్రాథమికోన్నత	204	45,800
ఉన్నత	330	30,898
మొత్తం	2,436	1,41,217

తిరుపతి జిల్లా సమాచారం

పాఠశాల కేటగిరీ	పాఠశాలల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ప్రాథమిక	1934	94,178
ప్రాథమికోన్నత	188	57,801
ఉన్నత	322	35,465
మొత్తం	2,444	1,87,444

చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పలు ఘటనలిలా..

- ఈ నెల 6వ తేదీన తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలంలోని ఎగువ సాంబయ్యపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు కృష్ణయ్య ఆ పాఠశాలలోని 4,7 తరగతుల విద్యార్థులతో అసభ్యకరంగా ప్రవర్తించారు. విచారణ నిర్వహించిన టీచర్లు ఆ ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేశారు.
- 2022 వ సంవత్సరం ఏప్రిల్ 30వ తేదీన చిత్తూరు జిల్లా బంగారుపాళెం మండలం చిల్లగుండ్లపల్లె ప్రాథమిక పాఠశాలలో అబు అనే ఉపాధ్యాయుడి లైంగిక వేధింపుల ఘటన దుమారం లేపింది. తాళికట్టేస్తానని, దువ్వెనలతో విద్యార్థుల తలలు దువ్వి, పౌడర్ రాసి, బొట్టు బిళ్లలు పెట్టేవాడని విద్యార్థినులు ఏకంగా అప్పట్లో కలెక్టర్ కే ఫిర్యాదులు చేశారు.
- ఈ ఏడాది జనవరిలో తిరుపతి జిల్లా చిల్లకూరు మండలం ఉడతావారిపాళెం ప్రాథమికోన్నత పాఠశాల బాలికలతో అదే పాఠశాల ఎస్జీటీ జాన్‌వెస్లీ అసభ్యంగా ప్రవర్తించి సస్పెండ్ అయ్యారు.



నిత్యం పర్యవేక్షణ అవసరం



పాఠశాలల్లో టీచర్ల విధి విధానాలపై నిత్యం పర్యవేక్షణ ఉండాలి. విద్యార్థినులు ఏదైనా ఫిర్యాదు చేస్తే వెంటనే ఆ సమస్యలను పరిష్కరించి వారికి ధైర్యం చెప్పాలి. ప్రాథమిక పాఠశాల దశ నుంచే పిల్లలకు గుడ్ టచ్...బ్యాడ్ టచ్‌ను నేర్పించాలి.

– హేమారెడ్డి, రిటైర్డ్ హెచ్‌ఎం, కార్వేటినగరం

చర్యలు కఠినం



పాఠశాలల్లో చదివే విద్యార్థినులతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే చర్యలు కఠినంగా ఉంటాయి. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం. ఎక్కడైనా సమస్యలు వస్తే విద్యార్థినులు హెచ్‌ఎంకు ఫిర్యాదు చేయాలి. బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే వదిలిపెట్టే ప్రసక్తే లేదు.

– శామ్యూల్, వైఎస్సార్‌కడపజిల్లా ఆర్జేడీ. పాఠశాల విద్య

ఉపేక్షించేది లేదు



బాలికలతో అసభ్యకరంగా ప్రవర్తిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. కఠినంగా చర్యలుంటాయ్. స్కూళ్లలో బాలికలకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం. నిత్యం వారి సమస్యలను మహిళా టీచర్లు ప్రత్యేకంగా తెలుసుకుంటున్నారు. ఎంఈఓలు, డీవైఈఓలు నిత్యం తనిఖీలు చేసి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు.

– వరలక్ష్మి, డీఈఓ, చిత్తూరు

బిడ్డల్లా భావించాలి



టీచర్లను విద్యార్థులు తమ తల్లిదండ్రులుగా భావిస్తారు. టీచర్లు కూడా వారిని తమ బిడ్డలుగా భావించాలి. అంతే తప్ప విద్యార్థులతో అసభ్యకరంగా వ్యవహరించడం సిగ్గుచేటు. కొందరు టీచర్లతో చెడ్డపేరు వస్తుంది. అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవు.

– కేవీఎస్ కుమార్, డీఈఓ, తిరుపతి

అవగాహన కల్పించాలి



బాలికలకు అవగాహన కల్పించాలి. విద్యార్థినులతో టీచర్లు మర్యాదగా వ్యవహరించాలి. కొందరి వికృత చేష్టలతో మొత్తం ఉపాధ్యాయ వృత్తికే మచ్చ తీసుకొస్తున్నారు.

– చంద్రయ్య, రిటైర్డ్ హెచ్‌ఎం, గంగమాంబపురం, విజయపురం

మాయమయ్యాడు.. మామూలు మనిషి

ఒకప్పుడు ఎటు చూసినా బంధాలు..అనుబంధాలు..ఆత్మీయతలు.. అనురాగాలు.. విలసిల్లేవి.. ప్రపంచీకరణ పుణ్యమాని.. మనిషిలో స్వార్థం పెరిగి మాన సంబంధాలు కనుమరుగవుతున్నాయి. తన జీవితం తనదే, పొరుగువారితో పనేముందన్న రీతిలో మానవుడు సాగుతున్నాడు. యాంత్రిక జీవనం గడుపుతున్నాడు.. మచ్చుకైనా మానవత్వం కనిపించకపోవడంతో మామూలు మనిషి మాయమైపోయాడనక తప్పదు. నేటి మానవ సంబంధాలపై ప్రత్యేక కథనం.

SUNDAY SPECIAL



- కనిపించని అనుబంధాలు, ఆత్మీయతలు
- మచ్చుకైనా కనిపించని మానవత్వం
- ఎవరి బతుకు వారిదేనన్న స్వార్థ మనస్తత్వాలు

పలమనేరు: మానవ సంబంధాలను మంటగలిపి కేవలం తమ స్వార్థం చూసుకుంటున్న మనుషులు సమాజంలో ఎక్కువైపోయారు. గమ్యం తెలియని జీవన పయనమేటో తెలియని గందరగోళం నెలకొంది. సమాజంలో మంట కలుస్తున్న మానవత్వాన్ని మేలు కొల్పాల్సిన అవసరం ఎంతైనా ఉంది. గత ఏడాదిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అందరూ ఉండి అనాథల్లా మారి కనీసం అంత్యక్రియలకు నోచుకోని పదిమందికి స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు దహన సంస్కారాలు చేశారంటే సమాజంలో ఎలాంటి మానవీయ సంబంధాలున్నాయో అర్థం చేసుకోవచ్చు.

ఇప్పుడు మానవ సంబంధాలెలా ఉన్నాయంటే?

పలమనేరు మండలంలోని మొరం పంచాయతీకి చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగి తన కుటుంబంతో బెంగళూరులో కాపురముంటున్నారు. అనారోగ్యంతో అతని తల్లి మృతి చెందింది. దీంతో ఆ ఇంటి యజమాని మానవత్వం లేకుండా తన ఇంట్లో శవాన్ని పెట్టకుండా అడ్డుకున్నాడు. దీంతో విధిలేక వారు స్వగ్రామానికి తీసుకొచ్చారు. బయట చనిపోయినవారు గ్రామంలోకి రాకూడదనే సంప్రదాయంతో శవాన్ని ఊరిబయటే పెట్టి ఆపై అంత్యక్రియలను నిర్వహించారు. పలమనేరు సమీపంలోని సాయినగర్‌లో ఓ ఉద్యోగి సొంత ఇంటిని నిర్మించుకుని పదేళ్లుగా కాపురముంటున్నాడు. ఆయన ఇప్పటివరకు ఇరుగుపొరుగు వారితో మాట్లాడలేదు. ఎరింటికీ వెళ్లలేదు. ఆ వీధిలో ఎవరికైనా కష్టమొచ్చినా సాయం చేయలేదు. పొద్దున ఆఫీసుకెళ్లడం పొద్దుపోయాక ఇంటికి రావడం తప్ప అతనికి ఎవరితోనూ సంబంధం లేని జీవితం గడుపుతున్నారు.

మారిన బతుకులు

ఒకటో తరగతి నుంచి కార్పొరేట్ స్కూల్ ఆపై కాలేజీ, మళ్లీ కుటుంబానికి దూరంగా పిల్లల చదువులు. ఆపై ఉద్యోగం రాగానే వారి జీవితం వారిది. ఇక ఇళ్లల్లోని పెద్దలను పిల్లలే వృద్ధాశ్రమాల్లో చేర్పిస్తున్నారు. దీంతో కుటుంబ విలువలు తెలియని పిల్లలు ఎవరికివారే అన్న భావనతో తమ బతుకులకు అంకితమైపోతున్నారు. స్మార్ట్‌ఫోన్ల పుణ్యమాని మానవ సంబంధాల పరిస్థితి మరీ ఘోరంగా తయారైంది. గతంలో ఓ గ్రామంలో వంద కుటుంబాలుంటే కనీసం 20 కుటుంబాలన్నా ఉమ్మడి కుటుంబాలు ఉండేవి. ఇప్పుడు ఊరికి రెండు, మూడు కుటుంబాలు సైతం కలిసి ఉండడం లేదు.

సచ్చినా బాధపడేవారెవరు?

సొంత కుటుంబసభ్యులు ఎవరైనా మృతి చెందితే కనీసం కొన్నేళ్లపాటు బాధపడే రోజులు గతంలో కనిపించేవి. కానీ ఇప్పుడు సొంత కుటుంబసభ్యులు చనిపోయినా కేవలం రెండు మూడు రోజులే బాధ, ఆపై అసలు పట్టించుకోరు.

మాయమవుతున్న మానవసంబంధాలు

ఎవరు ఏమైతే నాకేంటి నా కుటుంబం బాగుంటే చాలనే స్వార్థం ఎక్కువైంది. ఆఖరికి తన సొంత అమ్మా నాన్న, అక్కా చెల్లి, అన్నదమ్ములను సైతం పట్టించుకోవడం లేదు. గతంలో గ్రామంలో ఎవరి ఇంట్లోనైనా శుభ, అశుభకార్యాలు జరిగితే పనులు చేసేందుకు ఇంటికోమనిషి వెళ్లేవారు. ఇప్పుడు పెళ్లికి సైతం రావడంలేదు. దీంతో శుభ, అశుభ కార్యక్రమాలకు ఈవెంట్ మేనేజర్లే దిక్కుగా మారారు.



గతంలో ఉమ్మడి కుటుంబంతో అలా.. ఇప్పుడు స్మార్ట్‌ఫోన్లలో ఇలా

నాటి పలకరింపులు కరువు



గతంలో ఇంటికి ఎవరైనా బంధువులొస్తే గంటల తరబడి పలకరింలుండేవి. ఆపై బంధువులకు విందు భోజనం చేసిపెట్టేవాళ్లం. ఇప్పుడు ఎవరైనా బంధువులు ఇంటికోస్తే నిమిషం పలకరింపు, బిజీగా ఉన్నాం ఇంకోసారి వస్తాంలేనంటూ పదినిమిషాల్లో వెళ్లడం కనిపిస్తోంది. మన ఇంట్లోని వారు సైతం బంధువులతో మాట్లాడకుండా స్మార్ట్‌ఫోన్లకు అతుక్కుపోయి ఉంటున్నారు.

– లక్ష్మీపతినాయుడు, బురిశెట్టిపల్లి, బైరెడ్డిపల్లి మండలం

కష్టమొస్తే పలకరించేవాళ్లుండాలయ్యా!



గతంలో ఎవరికైనా కష్టం వస్తే ఇంటిపక్కనున్నవారో స్నేహితులో మంచి సలహా చెప్పి సమస్యకు పరిష్కారం చూపేవారు. ఇప్పుడు ఆత్మీయ పలకరింపులు లేవు. ఎవరు చూసినా వారి పనుల్లో బిజీబిజీ. రోడ్డుపై ప్రమాదం జరిగినా మనకెందుకులే, కేసవుతుందని వెళ్లిపోయే సమాజమిది. అమ్మా,నాన్న, బిడ్డలకంటే ఎక్కువగా సోషల్‌మీడియాతో గడుపుతున్నారు.

– పుష్పరాజ్, రిటైర్డ్ టీచర్, పలమనేరు

న్యాయవ్యవస్థపై నమ్మకం కల్పించాలి

– సుప్రీంకోర్టు జడ్జి సరస వెంకట నారాయణ భట్



సమావేశంలో పాల్గొన్న సుప్రీంకోర్టు, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు, జడ్జిలు

పలమనేరు: చట్టాల ద్వారా ప్రాథమిక హక్కులను కాపాడుతూ న్యాయవ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని కల్పించాల్సిన అవసరం ఉందని సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సరస వెంకట నారాయణ భట్ సూచించారు. పలమనేరు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు వద్ద రూ.15.18 కోట్లతో నూతనంగా నిర్మించిన నాలుగు కోర్టు భవనాలు, న్యాయమూర్తుల నివాస భవనాలను ఆయన హైకోర్టు ప్రధాన న్యాయమూరి ధీరజ్‌సింగ్ ఠాకూర్‌తో కలసి శనివారం ప్రారంభించారు. ఇందులో పలువురు హైకోర్టు న్యాయమూర్తులు, తిరుపతి, చిత్తూరు జిల్లా కోర్టు న్యాయమూర్తులు పాల్గొన్నారు. తొలుత జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ మణికంఠ చందోలు వారికి పుష్పగుచ్ఛాలందించి స్వాగతం పలికారు. పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పురోహితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆపై సర్వమత ప్రార్థనలు, జ్యోతిప్రజ్వలన కార్యక్రమాలు జరిగాయి. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తితో కలసి ఆయన కొత్త కోర్టు భవనాలను ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాను మదనపల్లి వాసినని, ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలువురు న్యాయవాదులతో సత్సంబంధాలున్నాయన్నారు. పలు రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలకు తాను హాజరయ్యానని చెప్పారు. కానీ సొంత జిల్లాలోని పలమనేరులో కోర్టు భవనాల ప్రారంభోత్సవానికి రావడం ఆనందంగా ఉందన్నారు. ఇక్కడి భవనాల్లో మౌలిక సదుపాయాలు బాగున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో హైకోర్టు జడ్జిలు కృష్ణమోహన్, టీసీడీ శేఖర్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు, తిరుపతి మూడో అదనపు జడ్జి గురునాథ్, చిత్తూరు అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి వెన్నెల, పలమనేరు సీనియర్ సివిల్ జడ్జి ఆదినారాయణ, జూనియర్ సివిల్ జడ్జి లిఖిత, స్పెషల్ మెజిస్ట్రేట్ రాధమ్మ, ఏపీ బార్‌కౌన్సిల్ ఛైర్మన్ నల్లారి ద్వారకనాథ రెడ్డి, స్థానిక బార్ కౌన్సిల్ అధ్యక్షుడు లక్ష్మీపతి తదితరులు పాల్గొన్నారు.



కాణిపాకం కిటకిట

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. దీంతో కాణిపాకం గ్రామం భక్తులతో కిటకిటలాడింది. వేకువజాము నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. క్యూలలో భక్తులు వేచి ఉన్నారు. దర్శనానికి గంటన్నరకు పైగా సమయం పట్టింది. వారికి ఇబ్బంది లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు చేపట్టారు.

క్లుప్తంగా

ఉద్యోగ భద్రత కల్పించాలి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఉద్యోగ భద్రత కల్పించి, న్యాయం చేయాలని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జయచంద్ర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర మంత్రి వర్గ సమావేశంలో ఆప్కాసు విధానాన్ని రద్దు చేయాలని నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆప్కాస్ విధానం కంటే మెరుగైన విధానాన్ని తీసుకు వచ్చి, అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్న ఉద్యోగులకు న్యాయం చేయాలని కీలక శాఖలలో పనిచేస్తున్న మూడు లక్షల మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు న్యాయం చేయాలని పేర్కొన్నారు.

అంగన్‌వాడీ సిబ్బందికి వృత్యంతర శిక్షణ


చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని అంగన్‌వాడీ సిబ్బందికి నాన్ రెసిడెన్షియల్ వృత్యంతర శిక్షణ ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర అధికారులు శనివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ ఉత్తర్వుల మేరకు ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు, రెండో విడతగా ఈ నెల 22, 24, 25 తేదీల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ శిక్షణకు కేంద్రాలుగా ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేయనున్నారు.

రోగితో వైద్యుల దురుసు ప్రవర్తన



డాక్టర్ల తీరుపై అదే ఆస్పత్రిలోని మరో డాక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితురాలు

చౌడేపల్లి: వైద్యోనారాయణ హరీ అన్నారు పెద్దలు.. అలాంటి వైద్యులే రోగితో దురుసుగా ప్రవర్తించిన సంఘటన చౌడేపల్లెలో వెలుగుచూసింది. బాధితురాలి కథనం మేరకు.. చిన్నకొండామర్రి గ్రామానికి చెందిన చిరంజీవి కుమార్తె షవ్యశ్రీ నెలసరి సమస్యతో బాధపడుతూ ప్రభుత్వాస్పత్రికి వెళ్లింది. ఆ సమయంలో ఆస్పత్రిలో డాక్టర్ పూజ, డాక్టర్ నవీన్‌కుమార్ విధి నిర్వహణలో ఉన్నారు. షవ్యశ్రీ తన తండ్రితో కలిసి తన ఆరోగ్య సమస్యను డాక్టర్ పూజకు వివరిస్తుండగా పక్కనే ఉన్న డాక్టర్ నవీన్‌కుమార్ సెల్‌ఫోన్‌లో యూట్యూబ్ చూస్తూ సౌండ్ ఎక్కువగా పెట్టుకుని ఆనందంలో మునిగి తేలుతున్నారు. ఆ సమయంలో శబ్దం ఎక్కువగా ఉండడంతో వైద్యురాలు పూజ చెప్పిన విషయం పేషంట్‌కు వినిపించలేదు. దీంతో సెల్‌ఫోన్లలో సౌండ్ తగ్గించాలని డాక్టర్ నవీన్‌కుమార్‌ను వారు కోరారు. దీంతో ఇద్దరు డాక్టర్లు పేషంట్‌తోపాటు అతని తండ్రిపై దురుసుగా ప్రవర్తించి హేళనగా మాట్లాడుతూ ముందు బయటకు వెళ్లిపోండని ఆదేశించారు. అంతటితో ఆగక సిబ్బందితో బయటకు గెంటేశారని బాధితురాలు ఆరోపించారు. ఈ విషయమై బాధితురాలు ఆస్పత్రిలోని మరో వైద్యునికి ఫిర్యాదు చేశారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ సుధారాణికి ఫోన్‌లో ఫిర్యాదు చేశారు. తమకు న్యాయం చేయకుంటే ఆందోళన చేస్తామన్నారు. ఇటీవల ఇదే తరహాలో రోగులతో దురుసుగా ప్రవర్తించిన సంఘటలు ఉన్నాయన్నారు. ప్రశ్నించిన వారిపై కక్ష సాధింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆస్పత్రికి వెళ్లిన రోగులతో డాక్టర్లు ఇలాగే ప్రవర్తిస్తున్నారని, దీంతో ఆర్ఎంపీ డాక్టర్ల వద్దకు వెళ్లాల్సి వస్తోందని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



పలమనేరులోని బ్రిటీష్ కలెక్టర్ క్యాంపు బంగ్లా(ఫైల్)

చరిత్ర ధనంతో రాదు..కాలంతో వస్తుంది..వస్తువులు, నిర్మాణాలు చారిత్రక సమయంతో చేకూరుతుంది.. నాటి వ్యక్తులు, వ్యవస్థలు నేడు లేకపోవచ్చు..కానీ వాటి ఆనవాళ్లు పలమనేరులో పుష్కలంగా ఉన్నాయి. వాటి వెనుక లోతైన చరిత్ర గమనం ఉంది. ఆ కట్టడాలకు కాలం చేకూర్చిన విలువ ఉంది. ఆ చరిత్ర రాసిన సంతకం నేటి తరానికి సజీవ సాక్ష్యం.. అదే బ్రిటిష్ వారి నిగూఢ పాలనకు నిదర్శనం.



బ్రిటీష్‌వారు నిర్మించిన తహసీల్దార్ కార్యాలయం

SUNDAY SPECIAL

చరిత్ర సంతకం.. సజీవ సాక్ష్యం

- ఆంగ్లేయులు నిర్మించిన భవంతుల్లో ఉన్న నేలమాలిగలు
- రెండో ప్రపంచ యుద్ధం వేళ కీలక పత్రాలు పలమనేరులో దాచిన వైనం
- పలమనేరు బ్రిటీష్ క్యాంపు కార్యాలయంలో సొరంగమార్గం
- శత్రువుల కన్నుగప్పేందుకు అడవుల్లోనూ రోడ్లు

పలమనేరు: స్వాతంత్ర్యానికి ముందు దేశాన్ని పాలించిన ఆంగ్లేయుల నిగూఢమైన పాలనకు పలమనేరు ప్రాంతంలోని పలు భవనాలు సజీవ సాక్షాలుగా కనిపిస్తున్నాయి. ఇంగ్లిషు వారి తెలివితేటలు, ముందుచూపునకు సంబంధించి వారు నిర్మించిన కార్యాలయాల్లోని నేలమాళిగలు(అండర్ గ్రౌండ్స్) చూస్తే ఇప్పటికీ ఆశ్చర్యం కలగకమానదు.

ఇది నాటి చరిత్ర

మద్రాస్ ప్రెసిడెన్సీలోని నార్త్ ఆర్కాట్ జిల్లా చిత్తూరు సబ్‌డివిజన్‌లో పలమనేరు తాలూకాగా ఉండేది. 1901లో పట్టణ జనాభా4,850గా ఉండేది. ఈ ప్రాంతం మైసూరు పీఠభూమిలో ఉంటూ సముద్రమట్టాని కంటే 2300 అడుగుల ఎత్తులో ఉండడంతోపాటు చుట్టూ కొండకోనలతో రమణీయంగా ఉంటుంది. దీంతో పలమనేరు ప్రాంతాన్ని బ్రిటీష్‌వారు తమ వేసవి విడిదిగా ఏర్పరచుకున్నారు.

యూరోపియన్స్ వేసవిలో ఇక్కడికి వస్తుండడంతో ఇక్కడ బంగ్లాలను కట్టారు. పాలనా సౌలభ్యం కోసం అరవై ఎకరాల్లో కలెక్టర్ క్యాంపు ఆఫీస్, క్రైస్తవ మత ఉద్ధరణ కేంద్రాలను నిర్మించారు.

సాక్ష్యాలివీ..

ప్రస్తుతం పలమనేరులోని పాత తహసీల్దార్ కార్యాలయంలోనూ అండర్‌గ్రౌండ్‌ఫ్లోర్ ఉంది. దీన్ని బ్రిటీషర్లు కట్టించిందే. ఇందులో పలమనేరు తాలుకాకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను గతంలో భద్రపరిచేవారు. దీనికి ఆనుకుని ఉన్న పాత ఉపఖజానా కార్యాలయంలోనూ రహస్యగదులున్నాయి. అప్పట్లో నగదును భద్రపరిచేందుకు కట్టుదిట్టమైన ఖజానా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉంది.



పాత సమితి కార్యాలయంలోని నేలమాలిగలోకి వెళ్లే మార్గం

అప్పట్లో బ్రిటీష్ వారు 20 వరకు భవనాలను ఇక్కడ నిర్మించినా ప్రస్తుతం నాలుగైదు మాత్రమే ఉన్నాయి. బ్రిటీష్ కాలం నాటి పలమనేరు చరిత్ర ఇంపీరియల్ గెజిటర్ ఆఫ్ ఇండియా(మద్రాస్) వాల్యూమ్-2లో రాసి ఉంది.

రహస్య పత్రాలను పలమనేరులో దాచిన ఆంగ్లేయులు

రెండో ప్రపంచ యుద్ధ సమయంలో (1939–45) జపాన్, జర్మనీల నుంచి బ్రిటన్ వారు పాలించే ప్రాంతాలపై బాంబు దాడులు జరిగే అవకాశం ఉంటుందని ఆంగ్లేయులు భావించారు. దీంతో మద్రాస్ ప్రెసిడెన్సీకి చెందిన కీలక పత్రాలను పలమనేరులోని కలెక్టర్ క్యాంపు కార్యాలయ నేలమాళిగలో దాచిపెట్టినట్టు ఆధారాలున్నాయి. ఈ భవనంలోని రహస్యప్రదేశంలోకి వెళ్లేందుకు వందమీటర్లలో ఓ దారి, బయటకు వెళ్లేందుకు 300 మీటర్ల సొరంగాన్ని నిర్మించారు. దానికి సంబంధించిన ఆనవాళ్లు అండర్‌గ్రౌండ్ ఇప్పటికీ కళాశాల కింద ఉంది.

శత్రువుల కళ్లుగప్పేలా అడవుల్లో రోడ్లు

శత్రువుల కళ్లుగప్పి తప్పించుకెళ్లేలా పలమనేరు నుంచి పలు మార్గాలను అడవుల్లో నిర్మించారు. మండిపేటకోటూరు నుంచి గంగన శిరస్సు వాటర్ పాల్స్‌కు 10 కిలోమీటర్ల 40 అడుగుల రోడ్డు ఇప్పటికీ ఉంది. అలాగే ప్రస్తుతం తమిళనాడులోని మోర్దన, బాపలనత్తం నుంచి నెల్లిపట్ల అరవట్ల మార్గాలు బ్రిటీషు వారు వేయించినవే.

సొరంగం ఇప్పటికీ ఉంది



"పలమనేరు టౌన్‌లోని జూనియర్ కళాశాలే బ్రిటీష్ కలెక్టర్ క్యాంపు కార్యాలయం. బ్రిటీష్‌వారి బంగ్లాల కింద రహస్య గదులు కచ్చితంగా ఉంటాయి. రెండో ప్రపంచ యుద్ధ సమయంలో ఆంగ్లేయులకు సంబంధించిన కీలక పత్రాలు, వస్తువులను ఇక్కడే దాచారు. ఈ భవనాలకు తూర్పుగా సొరంగ మార్గం ఇప్పటికీ ఉంది.

– మునిరత్నం రెడ్డి, చరిత్రకారుడు, కవి, బత్తనపల్లి

ముందుచూపెక్కువ



పట్టణంలోని మద్రాస్– ముంబై ట్రంకురోడ్డు, మద్రాస్– బెంగళూరు రహదారులు బ్రిటీష్‌వారి హయాంలోనివే. పట్టణంలోని రౌండ్ రోడ్డు 80 అడుగుల్లో నిర్మించారు. దండుమిట్టలో బ్రిటీషర్ల గుర్రాలను కట్టి, సైనికులుండే వారు. అందుకే దాన్ని దండుమిట్టగా ఇప్పటికీ పిలుస్తున్నాం. బ్రిటీష్ వారికి ముందుచూపు ఎక్కువ.

– జల్లిపేట సుబ్రమణ్యం, సీనియర్ లాయర్, పలమనేరు.

'గీత' మద్యం దుకాణాల్లో కూటమి బినామీలు

చిత్తూరు అర్బన్: కల్లుగీత సామాజికవర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాల్లో కూటమి నేతల బినామీలు రంగంలోకి దిగారు. జిల్లాలోని చాలా వరకు మద్యం దుకాణాల్లో పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేల అనుచరులు, అగ్రవర్ణాలకు చెందిన కూటమి నేతలు టెండర్లు దాఖలు చేశారు. జిల్లాలోని 10 మద్యం దుకాణాలను గీత కులాలకు కేటాయించడం, దరఖాస్తు చేసుకునే ప్రక్రియకు శనివారంతో గడువు ముగిసింది. 10 దుకాణాలకు దాదాపు 80 వరకు దరఖాస్తులు వచ్చినట్లు తెలుస్తోంది. చివరి రోజున పలు మద్యం దుకాణాలకు పెద్ద ఎత్తున దరఖాస్తులు దాఖలయ్యాయి. అయితే ఇందులో కూటమి నేతలకు చెందిన ఇతర సామాజికవర్గాల వాళ్లు, గీత కార్మికుల బినామీలతో దరఖాస్తులు వేయించారు. వీళ్లను అనర్హులుగా ప్రకటించాలని ఆ కుల సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నా, అధికారులు పట్టించుకోవడంలేదు. ఇక వచ్చిన దరఖాస్తులను ఆదివారం పరిశీలిస్తారు. సోమవారం చిత్తూరులోని కలెక్టరేట్ కార్యాలయంలో లాటరీ పద్ధతి ద్వారా గీత సంఘాలకు మద్యం దుకాణాలను కేటాయిస్తారు.

హామీలు నెరవేర్చాలి

చిత్తూరు రూరల్(కాణిపాకం): ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రేమ డిమాండ్ చేశారు. చిత్తూరు నగరంలో శనివారం యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అంగన్‌వాడీ సిబ్బందికిచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. సమస్యలను పరిష్కరించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పోరాటానికి శ్రీకారం చుడతామన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు నాగరాజు, కోదండయ్య, రమాదేవి, అరుణ, విజయబాగ్యం, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొన్న లారీ

- 13 మందికి తీవ్ర గాయాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- విందుకు వెళుతుండగా ఘటన



చికిత్స పొందుతున్న వరుడు రాము

గంగాధరనెల్లూరు/ చిత్తూరు రూరల్: గంగాధరనెల్లూరు వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో 13 మంది గాయపడ్డారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటనకు సంబంధించి యాదమరి మండలం గుట్టపై దళితవాడకు చెందిన రామన్‌కు, గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం గ్రామానికి చెందిన కవితతో పెద్దల సమక్షంలో శుక్రవారం యాదమరిలోని వరదరాజులస్వామి ఆలయంలో వివాహం జరిగింది. గంగాధరనెల్లూరులోని వధువు నివాసంలో జరిగిన విందుకు ఇరు పక్షాల కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు హాజరయ్యారు. ఆదివారం వరుడి స్వగ్రామంలో విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి వధూవరుల కుటుంబాలకు చెందిన 13 మందితో కలిసి షేర్ ఆటోలో బయలుదేరారు. ఆటో గంగాధరనెల్లూరు–వేల్కూరు బ్రిడ్జి వద్ద వస్తుండగా పుత్తూరు వైపు వెళుతున్న లారీ ఆటోను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో ముందుభాగం ధ్వంసమైంది. ప్రయాణీకులంతా ఆటోలో చిక్కుకోగా.. వెంటనే స్థానికులు స్పందించి క్షతగాత్రులకు బయటకు తీశారు. అంబులెన్స్‌కు సమాచారం ఇచ్చి, గాయపడిన వారిని చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆటోలో ఉన్న వరుడు రాము కాలు విరిగింది. వధువు స్వల్ప గాయాలతో బయటపడింది. కాగా ఆటో నడుపుతున్న కోదండన్ (వధువు చిన్నాన్న), పెరియస్వామి (వధువు చిన్నాన్న) తీవ్రంగా గాయపడ్డారు. వీరితో పాటు శివ, సఖి, రజని, శాంతి, సుమతి, అల్లెమ్మ, చిత్ర, రాబిన్, ప్రియాంకలకు సైతం స్వల్ప గాయాలయ్యాయి. గంగాధరనెల్లూరు సీఐ వాసంతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పెరియస్వామి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో తమిళనాడులోని ఓ ఆస్పత్రికి తరలించారు. మిగిలిన వారికి చిత్తూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు.



పెరియస్వామిని వేలూరుకు తరలిస్తున్న కుటుంబ సభ్యులు



ధ్వంసమైన ఆటో

రెండో రోజూ గాలింపు చర్యలు





గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం గాలిస్తున్న అగ్నిమాపక సిబ్బంది, గల్లంతైన సెల్వకుమార్(ఫైల్)

బంగారుపాళెం: మండలంలోని మొగిలి గొనిచెరువులో గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం రెండోరోజూ గాలింపు చర్యలు కొనసాగాయి. ఇంతవరకు ఆచూకీ లభించలేదని పోలీసులు తెలిపారు. గొనిచెరువులో ఈత కొట్టేందుకు వెళ్లిన సెల్వ కుమార్ గల్లంతు అయిన విషయం తెలిసిందే. శుక్రవారం రాత్రి కావడంతో సెల్వకుమార్ కోసం చేపట్టిన గాలింపు చర్యలను అగ్నిమాపక సిబ్బంది శనివారం మళ్లీ కొనసాగించారు. సాయంత్రానికి కూడా గల్లంతైన వ్యక్తి ఆచూకీ లభించలేదు. సెల్వకుమార్ గల్లంతైన సమాచారం తెలుసుకున్న కుటుంబ సభ్యులు మొగిలి గ్రామానికి చేరుకున్నారు. చెరువు గట్టు వద్ద సెల్వకుమార్ ఆచూకీ కోసం ఎదురు చూస్తూ రోదించడం అక్కడ స్థానికుల కంట తడిపెట్టించింది.

కూటమి నేత ఇంట్లో ఎర్రచందనం స్వాధీనం

సాక్షి టాస్క్‌ఫోర్స్: చిత్తూరు రూరల్ మండలం దిగువ కండ్రిగలో ఓ కూటమి నేత ఇంట్లో దాదాపు 9 ఎర్రచందనం దుంగలను చిత్తూరు ఈస్ట్ అటవీశాఖ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. స్థానికంగా ఉన్న ఎర్రచందనం చెట్టును తీసుకొచ్చి వాటిని దుంగలుగా చేసి పెట్టుకున్నట్లు సిబ్బందికి సమాచారం వచ్చింది. దీనిపై శనివారం రాత్రి సంఘటన స్థలానికి చేరుకుని దుంగలను, ఆ వ్యక్తిని అదుపులో తీసుకున్నారు. ఇతనిపై కేసులు లేకుండా చూడాలని కూటమి నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు.

క్రీడా కార్యక్రమాలకు మాత్రమే అనుమతులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లోని క్రీడా మైదానాలు క్రీడా కార్యక్రమాలకు మాత్రమే అనుమతివ్వాలని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారులు జారీ చేసిన ఈ ఉత్తర్వులు శనివారం డీఈఓ కార్యాలయానికి చేరాయి. ఆ ఉత్తర్వుల మేరకు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల క్రీడా మైదానాల అనుమతులకు స్పోర్ట్స్ పాలసీ నిబంధనలు అమలు చేయాలన్నారు. ఉదయం 4 నుంచి 7 గంటల వరకు ప్రజలకు క్రీడా కార్యక్రమాల నిమిత్తం మాత్రమే అనుమతివ్వాలని ఆ ఉత్తర్వుల్లో ఆదేశించారు.